గ్రామాలు@వ్యర్థాలు



కర్లపాలెం రోడ్డులో అధ్వానంగా ఉన్న చెత్త నిల్వలు



దరివాద కొత్తపాలెంలో జీబీసీ రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

- రోడ్లను మింగేస్తున్న చెత్త నిల్వలు
- రోగాలు ప్రబలుతాయంటున్న ప్రజలు
- గ్రామాల్లో కానరాని స్వచ్ఛ భారత్
- అవగాహన కల్పించడంలో విఫలమవుతున్న అధికారులు

బాపట్ల: నాడు పచ్చనిచెట్లతో చల్లని గాలులు వీస్తూ.. ఆహ్లాదానికి మారుపేరుగా నిలిచే గ్రామీణ ప్రాంతాలు నేడు రోజుల తరబడి నిల్వ ఉంటున్న వ్యర్థాలతో వాతావరణ కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా ఆయా గ్రామాల శివారులో ఉండే వ్యర్థాల నిల్వలే ముందుగా స్వాగతం పలుకుతున్నాయి. గ్రామాల్లో కూడా ఎక్కడో మారుమూలన కాదండి.. ముఖ్యంగా జనసంచారం, పాఠశాలలు, దేవాలయాలు ఉండే ప్రాంతాల్లోనే చెత్తను వేస్తూ ఆయా ప్రాంతాలను కంపు కొట్టిస్తున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన సిబ్బంది రోజుల తరబడి చెత్త నిల్వలను అలాగే వదిలేస్తున్నారు. దీంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు.

కానరాని స్వచ్ఛ భారత్

గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, వీధులు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలి. ఎక్కడా కూడా వాతావరణ కాలుష్యం ఏర్పడటానికి వీల్లేదు అంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమయం దొరికినప్పుడల్లా ఊకదంపుడు ఉపన్యాసాలిస్తుంటారు. కానీ ఆచరణలో అమలు చేయటంలో మాత్రం ఎప్పటికప్పుడు ఘోరంగా విఫలమవుతున్నారు. ఉన్నతాధికారుల మాటను పరిగణనలోకి తీసుకొని గ్రామాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకున్న కార్యదర్శులు కనుచూపు మేరలో కనిపించడం లేదు.

గ్రామం.. గ్రామస్తులు ఎలా ఉంటే మనకెందుకు.. మనం వెళ్లామా.. సంతకం పెట్టామా.. గ్రామస్తులతో కొద్దిసేపు మాట్లాడామా.. తిరిగి వచ్చామా అనే రీతిలోనే ఉద్యోగం చేస్తున్నారే తప్ప గ్రామంలో ప్రధానంగా ఎలాంటి సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. దానికి గ్రామస్తులు ఏ మేరకు సహకరిస్తారు అనే అంశాలపై చర్చలు జరిపిన దాఖలాలే లేవు.

రోడ్లపై విచ్చలవిడిగా చెత్త

మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లపై చెత్త చెదారం నిల్వలు పేరుకుపోయి ఏ గ్రామంలో చూసినా ఊరికంటే ముందు గ్రామం శివారులో ఉన్న వ్యర్థాలు, చెత్తచెదారమే స్వాగతం పలుకుతున్నాయి. ప్రధాన రహదారులపై కూడా వ్యర్థాలను విచ్చలవిడిగా పడేస్తున్నారు. కనీసం గ్రామస్తులకు చెత్తపై ఒక్క రోజు అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ముఖ్యంగా మండలంలోని వెదుళ్లపల్లి, కొండుబొట్లవారిపాలెం, నందిరాజుతోట, మర్రిపూడి, కనకాద్రినగర్, మరుప్రోలువారిపాలెం, సూర్యలంక, జమ్ములపాలెం తదితర గ్రామాల్లో రోడ్ల వెంబడే చెత్త నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే ముక్కుమూసుకొని వెళ్లాల్సిందేనని ప్రయాణికులు, గ్రామస్తులు వాపోతున్నారు.

చర్యలు తీసుకోవాలి

ప్లాస్టిక్ వస్తువుల వాడకం మానవ మనుగడకే ముప్పు.. అలాంటి నిత్య రోడ్ల వెంబడి ఇష్టానుసారం పడవేసే చెత్తలో అధిక శాతం ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తూ ఉంటాయి. దీనిపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేకాక యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లను రోడ్ల వెంబడి పారేయటంతో వ్యర్థాలతోపాటు, వాటిని తిని ఆవులు, గేదెలు, గొర్రెలు మృత్యువాత పడుతున్న సందర్భాలు అనేకం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ వస్తువుల నిషేధంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల వెంట ఉన్న చెత్త నిల్వలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

గ్రామీణ ప్రాంతాల్లో చెత్త నిల్వలు రోడ్లపై లేకుండా ఆయా పంచాయతీల కార్యదర్శులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం. అదే విధంగా ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై గ్రామస్తులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

–బాబురావు, ఎంపీడీఓ, బాపట్ల

క్లుప్తంగా

కూటమి అభ్యర్థి గెలుపునకు పూర్తి సహకారం

వేమూరు (కొల్లూరు) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుంటూరు, కృష్ణా జిల్లాల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుకు జనసేన పార్టీ సహాయ సహకారాలు అందిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ తెలియజేశారు. ఆదివారం జనసేన పార్టీ నాయకులు చందు సాంబశివరావు, చవ్వాకుల కోటేష్‌బాబులతో కలసి ఆమె ఎన్నికల విధానాలపై ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలసి చర్చించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సలీమ్‌కు డాక్టర్ గణేష్ పరామర్శ



రేపల్లె రూరల్: నిజాంపట్నం మండలం ముత్తుపల్లి మాజీ సర్పంచ్ ఎం.అబూసలీమ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆదివారం అబూసలీమ్‌ను కలిసి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అబూసలీమ్‌ను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. అదేవిధంగా ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందిన నగరం మండలం పెదమట్లపూడి గ్రామానికి చెందిన అట్ల దుర్గాప్రసాద్ కుటుంబాన్ని డాక్టర్ గణేష్ పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగరం మండల కన్వీనర్ ఇంకొలు రామకృష్ణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బెజవాడ జోసఫ్, పార్టీ నాయకులు గాలి మోటు రాజశేఖర్, దొంతుబోయిన కొండలు రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ



కర్లపాలెం: విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులవ్వాలని కరుణా జీవన్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు అన్నారు. కర్లపాలెం బీసీ బాలుర హాస్టల్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఆదివారం కరుణా జీవన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ప్రయోజకులవ్వాలని చెప్పారు. విద్యావంతులైన వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వడ్లమూడి సురేంద్రబాబు, పి.నారాయణ, విద్యార్థులు ఉన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

తెనాలి అర్బన్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని వైఎస్సార్ సీపీ 15వ వార్డు కౌన్సిలర్, చినరావూరు వాకర్స్ సొసైటీ అధ్యక్షుడు గుంటూరు కోటేశ్వరరావు సూచించారు. చినరావూరు వాకర్స్ సొసైటీ ఆధ్వర్యంలో శిల్పి అక్కల వెంకటేశ్వరరావు సహకారంతో ఆదివారం పార్కులో ఏర్పాటు చేసిన క్రియాటిన్ పరీక్ష కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల జీవన ప్రమాణం పెరుగుతుందని తెలిపారు. చినరావూరు పార్కులోని వాకర్స్ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వాకర్స్‌కు క్రియాటిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి జొన్నాదుల నరసింహారావు, ప్రతినిధులు కేసన శేఖరరావు, బూరెల నరసింహారావు, అద్దెపల్లి సాంబశివరావు, కొత్తమాసు కుమార్, ఓంకార ప్రసాద్, టి.లక్ష్మీప్రియ, కె.దివ్య, రాంబాబు, సుబ్బారెడ్డి, స్వాములు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



గుంటూరు రూరల్: నెలనెలా అన్నసంతర్పణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో ఆధ్వర్యంలో మండలంలోని ఏటుకూరు గ్రామం అనంతవరప్పాడు రోడ్డులోగల మమ్మీ డాడీ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని 60 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య, క్లబ్ సభ్యులు లయన్ యరసాని కోటేశ్వరరావు, తాడికొండ ఎంఈఓ ధూపాటి ప్రభాకరరావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



తెనాలి అర్బన్: క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో గంగానమ్మపేటలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ బి.రాధ పేర్కొన్నారు. 10 మంది విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు నగదు బహుమతులు లభించినట్లు చెప్పారు. స్కూల్ ఆవరణలో ఆదివారం విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ గోపి, రాజేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బైక్‌ను దహనం చేసిన దుండగులు

తెనాలి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జి వద్ద నిలిపి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. లాడ్జిలో పని చేసే యువకుడి బైక్ దగ్ధమవుతూ పొగలు రావడాన్ని శనివారం రాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో లాడ్జిలో ఉన్న వారు గమనించారు. గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టి ఉంటారని వాహన యజమాని అనుమానిస్తున్నాడు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనికుల్లా పనిచేసి పార్టీ ప్రతిష్టను పెంచాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



గణేష్ దంపతులకు జ్ఞాపికను బహూకరిస్తున్న నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు

చెరుకుపల్లి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి నియమించబడిన పలువురు వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు గుళ్ళపల్లిలోని డాక్టర్ గణేష్‌ను తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి నాయకులను, కార్యకర్తలను కలుపుకుని పార్టీని పటిష్టం చేయాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. డాక్టర్ గణేష్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు శౌంతి సురేష్, చేనేత విభాగం అధ్యక్షుడు కందుల సురేష్, మండల అధ్యక్షుడు దుండి వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, నాయకులు కాశీ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

పూర్వ క్రీడాకారుల ఆత్మీయ క్రికెట్ పోటీ



క్రికెట్ పోటీల అనంతరం క్రీడా మైదానంలో పూర్వ క్రీడాకారులు

కొల్లూరు : ఆటపాటలతో చిన్ని తనంలో సరదాగా క్రీడా మైదానంలో గడిపిన క్రీడాకారులు అపూర్వ ఆత్మీయ కలయికతో ఒకే వేదికలో కలిసి ఆటలతో చిన్నతనాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ, ఉద్యోగ బాధ్యతలతో పలు ప్రాంతాలలో నివసిస్తున్న కొల్లూరు పరిసర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు ఆదివారం కొల్లూరు బాలుర, బాలికోన్నత పాఠశాలల క్రీడా మైదానంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. తామ విద్యార్థి దశలో ఆటపాటలతో క్రీడా మైదానంలో గడిపిన ఆత్మీయ క్షణాలను తలచుకుని ఆటలలో మునిగితేలారు. కొల్లూరు లెజెండరీ క్రికెట్ పోటీల పేరుతో క్రీడా మైదానంకు చేరుకున్న క్రీడాకారులు రెండు జట్లుగా విడిపోయి క్రికెట్ మ్యాచ్‌లు ఆడి తమ ప్రతిభాపాటవాలలో ఎటువంటి వన్నె తగ్గలేదని నిరూపించారు. మధ్యాహ్నం భోజనాలు సైతం క్రీడా మైదానంలోనే చేసిన అనంతరం తిరిగి క్రికెట్ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొన్న జట్లకు బహుమతులు అందజేశారు. పూర్వపు క్రీడాకారులు కలసి సమకూర్చుకున్న నగదుతో బహుమతులకు తోడు, తమ కలయికకు గుర్తుగా టీ షర్టులను అందజేశారు. అనంతరం భవిష్యత్తులో సైతం ఇదే తరహాలో తరచూ కలుసుకుంటూ ఆటల పోటీలలో పాలుపంచుకోవాలని చర్చించుకొని వీడ్కోలు పలికారు.

ఘనంగా నాంచారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తెనాలి టౌన్: స్థానిక గంగానమ్మ పేటలోని పిల్లలమర్రి వారి వీధిలో గల విశ్వనాథపల్లి నాంచారమ్మ తల్లి దేవస్థాన 22వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త కొండూరు అంకమరావు, కామేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో మహోత్సవాలు వేడుకగా జరిగాయి. కనకతప్పెట్లు, మేళతాళాల వాయిద్యాల నడుమ మహిళలు కలశాలు చేపట్టి ఉత్సవ విగ్రహంతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దేవాలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ గావించారు. ఆలయ ధర్మకర్త కామేశ్వరి మాట్లాడుతూ 24వ తేదీ మధ్యాహ్నం అమ్మవారికి పూజలతో పాటు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కొల్లూరు నాగలక్ష్మి, నాంచారయ్య, శ్రావణ్‌కుమార్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ధార్మిక చింతన అవసరం



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సభ్యులు

తెనాలి టౌన్: ప్రతి ఒక్కరూ ధార్మిక చింతన కలిగి ఉండాలని శ్రీ ఆంజనేయ ధ్యాన యోగ మండలి నిర్వాహకులు కిశోర్ గురూజీ సూచించారు. దేవాలయ పరిశుభ్రత యోగంలో భాగంగా ఆదివారం స్థానిక చినరావూరు సోమేశ్వరస్వామి దేవాలయంలో సభ్యులంతా ఆలయ పరిసరాలను నీటితో పరిశుభ్రం చేశారు. కిశోర్ గురూజీ మాట్లాడుతూ పదేళ్ల కిందట ప్రారంభించిన ఈ యజ్ఞంలో యోగ సాధకులు 100 మంది దాకా నెలలో ఒక దేవాలయాన్ని నీటితో శుద్ధి చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన, పాప భీతి కలిగి ఉండాలని తెలిపారు. ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి శాంతి కలుగుతుందని వెల్లడించారు. అనంతరం సభ్యులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో తాడికొండ శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీనాగరాజు, లత, అరుణకుమారి, రేఖ, నళిని, పురుషోత్తమ కృష్ణ, గోవర్ధనస్వామి, ఎం.శ్రీనివాసరావు, పలువురు యోగ సాధకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

పొన్నూరు: మండల కెమిస్ట్, డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ నిర్వహణలో పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులోని మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన రక్తనాళాల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శిబిరంలో హాస్పిటల్ వైద్యులు ధమనుల వ్యాధులు, సిరల పుండ్లు, డయాబెటిక్ పాదం వంటి రోగాలకు సంబంధించిన పరీక్షలను రోగులకు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు, కార్యదర్శి ఎల్.మోహనకృష్ణ, కోశాధికారి తాతా హరీష్, సభ్యులు పర్యవేక్షించారు.

క్షయ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



తెనాలి అర్బన్: మహర్షి దయానంద సరస్వతి జన్మదినాన్ని పురస్కరించుకుని నందివెలుగులోని వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో 50మంది క్షయ, ఎయిడ్స్ రోగులకు ఆదివారం పాత ప్రభుత్వ వైద్యశాలలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తుమ్మల కృష్ణకుమారి, గుగ్గిలం రామమోహనరావు, కూరపాటి రవీంద్రనాథ్, కల్యాణి, జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొలసాని రామ్‌చంద్, కటకం ప్రసాద్, పల్లెకొండ రవికుమార్, అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తెనాలి అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం వ్యవస్థాపక దినోత్సవాన్ని కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డుకు ఎంపికైన వీరస్థలి డాక్యుమెంటరీ నటులను ఘనంగా సన్మానించారు. స్కూల్ నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవయజ్ఞం మురళీకృష్ణ, క్లబ్ ప్రతినిధులు గుప్తా వెంకటరత్నం, డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్, ఈదర వెంకటపూర్ణచంద్, కొఠారి చేతన్‌రాజ్, కొల్లి రాజేంద్రప్రసాద్, డాక్టర్ జీవనలత పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

పెదకాకాని: ప్రజల హక్కుల కోసం, బలహీన వర్గాలకు సత్వర న్యాయ సహాయం కోసం ప్రజా సంకల్ప వేదిక సొసైటీ రాష్ట్ర కమిటీలో నూతనంగా నియమితులైన వారు నిర్విరామంగా కృషి చేయాలని ఏపీ హైకోర్టు న్యాయవాది నంబూరు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని నంబూరు విజయభాస్కర్ నగర్‌లో ప్రజా సంకల్ప వేదిక సొసైటీ రాష్ట్ర కమిటీలో భాగమైన అవినీతి నిరోధక విభాగం రాష్ట్ర అడ్వైజర్‌గా, గుంటూరు జిల్లా ఇన్‌చార్జిగా ఎం.సుబ్బారావు, మానవ హక్కుల పరిరక్షణ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కట్టెపోగు నాగేశ్వరరావు నియమితులైన సందర్భంగా అభినందన సభ జరిగింది. సభకు నంబూరు సాంబయ్య అధ్యక్షత వహించారు. న్యాయవాదులు, ఉద్యోగులు, మేధావులు ఈ సంఘాల్లో పనిచేస్తున్నారని అందరూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నంబూరు సాల్మన్, యోహాన్, రత్న కిషోర్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన డీ–3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం బుర్రిపాలెం దగ్గరలోని ఎస్ బిల్డింగ్‌లో నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన రోగులకు బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ తీశారు. నెలకు సరిపడా మందులను ఇచ్చారు. షుగర్ వ్యాధిగ్రస్తులు పాటించాల్సిన ఆహార నియమాలను తెలియజేశారు. మహిళల్లో క్యాన్సర్ నిరోధానికి 9–14 ఏళ్లలోపు పిల్లలు, 45 సంవత్సరాలలోపు మహిళలు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను తీసుకోవాలని ఆమె సూచించారు. వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు చేశారు.

గ్రామాల్లో కేంద్ర బృందం సర్వే పూర్తి



కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం

చెరుకుపల్లి: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 5 రకాల పథకాల అమలవుతున్న తీరుపై కేంద్ర బృందం మండలంలో రెండు రోజులు సర్వే నిర్వహించారని ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ కేజీఏ శ్రీనివాసన్ తెలిపారు. మండలంలోని కనగాల గ్రామంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ నియమించిన సంభోధి రీసెర్చ్, కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా రెండవ రోజు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, నేషనల్ షోషన్ అసిస్టెంట్ ప్రోగ్రాం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, దీన దయాళ్ నేషనల్ లైవ్లీహుడ్ మిషన్, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వంటి కేంద్రం అందిస్తున్న పథకాల గురించి రెండు గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు కొన్ని ఇళ్లకు స్వయంగా వెళ్లి పథకాలు అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ షేక్ రజియ, పంచాయతీ కార్యదర్శి తెనాలి వెంకటేశ్వర్లు, న్యూఢిల్లీ నీతి ఆయోగ్ ఫీల్డ్ మేనేజర్ వికాస్ మల్కర్, కేంద్ర బృందం సభ్యులు వి.సంధ్యారాణి, భానుచందర్, జి.సంధ్యారాణి, లోకేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాగ రంజితంగా పంచరత్న గాన గోష్టి



రామస్వామిని గండ పెండేరంతో సత్కరిస్తున్న కనకదుర్గ దంపతులు

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేట భాగవతులు వారి వీధిలో గల అనిరుధ్ సదన్‌లో ఆదివారం వీణ గురువు పుచ్చా కనకదుర్గ ఆధ్వర్యంలో పంచరత్న గాన గోష్టిని ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత అన్నవరపు రామస్వామి, గుంటూరుకు చెందిన సంగీత విద్వాంసులు కలిసి శ్రీ త్యాగరాజస్వామి రచించిన ఘనరాగ పంచరత్న కృతులను గాత్రం, వీణ, వయొలిన్, మృదంగం, ఘటం వంటి వాయిద్య సహకారంతో ప్రేక్షకులను రంజింపజేశారు. పాటిబండ్ల జాన శాంతి, రాగంపూడి అమూల్య, అనఘాలు కీర్తనలను ఆలపించారు. వీణపై కనకదుర్గ, మాల్కోస్‌పై వాణి, వయొలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై సుధాకర్, ఘటంపై కిశోర్ సహకరించారు. పంచరత్న సేవ అనంతరం పుచ్చా కనకదుర్గ, శిష్య బృందం పద్మశ్రీ అన్నవరపు రామస్వామిని గండపెండేరంతో సత్కరించారు. కర్ణాటక సంగీత వార సత్వాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు, అనేక మంది కళాకారులకు శిక్షణ ఇవ్వడంలో రామస్వామి చేసిన కృషిని అభినందించారు.

రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు

నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహనరావు



మాట్లాడుతున్న కొల్లా రాజమోహనరావు

కాకుమాను: ప్రభుత్వాలు మారుతున్న రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని గత అనేక సంవత్సరాల నుంచి గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని అనేక ఉద్యమాలు చేసిన ఫలితం లేదని నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహనరావు అన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య మెమోరియల్ లైబ్రరీలో ఆదివారం గుంటూరు ఛానల్ పొడిగింపుపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాజమోహనరావు మాట్లాడుతూ గత 85 సంవత్సరాల నుంచి గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని అనేకమార్లు ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా నేటివరకు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన తెలిపారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో గుంటూరు ఛానల్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఛానల్‌ను పొడిగించడం వలన అనేక గ్రామాలకు తాగు,సాగు నీరు సకాలంలో అందుతాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని ఏ పంటకు సరైన గిట్టుబాటు ధరలేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రైతులు రోడ్డెక్కవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. యార్లగడ్డ అంకమ్మ చౌదరి, ప్రొఫెసర్ కారుమంచి విజయ్ కుమార్, లావు అంకమ్మ చౌదరి, కొల్లా నిర్మల, ఈదర భ్రమరాంబ, లావు చౌడేశ్వరి, నాయుడు సుబ్బారావు, దివి ప్రమీల, గోవాడ సత్యన్నారయణ, కొల్లా వీరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.